RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 110 | పేజీలు : 4 | శుక్రవారం 23 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రహస్యాల లీక్..

ఇద్దరు కీలక అధికారులపై విచారణ!



ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి 40 ఏళ్లు..

రూబీ జూబ్లీ వేడుకలకు ఉపరాష్ట్రపతి, గవర్నర్, చంద్రబాబు

దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిన ఎన్టీఆర్ వర్సిటీ

40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రూబీ జూబ్లీ వేడుకల నిర్వహణ

అక్టోబర్ 26న విజయవాడలో జరగనున్న ఉత్సవాలు

ముఖ్య అతిథులుగా భారత ఉపరాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి హాజరు

దేశ వైద్య విద్యారంగంలో ఒక చారిత్రక అధ్యాయాన్ని లిఖించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 ఏళ్ల మైలురాయిని పురస్కరించుకుని రూబీ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ప్రతిష్ఠాత్మక ఉత్సవాలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ వివరాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ శు క్రవారం విజయవాడలో మీడియాకు వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా 1986 నవంబర్ 1న ఏర్పాటైన ఈ సంస్థ, 2026 నవంబర్ 1 నాటికి 40 వసంతాలు పూర్తి చేసుకోనుందని ఆయన తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, అక్టోబర్ 26వ తేదీ సోమవారం విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో రూబీ జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మంది వైద్యులను, ఆరోగ్య నిపుణులను దేశానికి అందించిన ఘనత ఈ విశ్వవిద్యాలయానికి దక్కుతుందని వీసీ చంద్రశేఖర్ కొనియాడారు. ఈ చారిత్రక వేడుకలకు దేశంలోని ప్రముఖ వైద్యులు, పూర్వ విద్యార్థులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

430 పరుగుల లక్ష్య ఛేదన..

శ్రీలంక నమ్మకమే గెలిపించిందంటూ అజారుద్దీన్ ప్రశంసలు

ఇంగ్లండ్‌పై వన్డేలో శ్రీలంక చారిత్రక విజయం

430 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన లంక జట్టు

శ్రీలంక ఆటగాళ్ల విశ్వాసాన్ని ప్రశంసించిన అజారుద్దీన్

వన్డే క్రికెట్ చరిత్రలో ఇది రెండో అతిపెద్ద ఛేదన

హ్యారీ బ్రూక్ రికార్డు డబుల్ సెంచరీ వృథా



హైదరాబాద్

ఇంగ్లాండ్‌పై శ్రీలంక 430 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంపై తెలంగాణ మంత్రి, టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ స్పందించారు. శ్రీలంక జట్టుపై ప్రశంసలు కురిపించారు. “భారీ లక్ష్యాన్ని ఛేదించగలమన్న నమ్మకాన్ని శ్రీలంక ఆటగాళ్లు చివరి వరకు కోల్పోలేదు. అందుకే గెలిచారు. ఒకప్పుడు 400 పైగా పరుగులు ఛేదించడం అసాధ్యం అనిపించేది. కానీ ఆధునిక క్రికెట్‌లో అది సాధ్యమవుతోంది. శ్రీలంక ఆటగాళ్లు అసాధారణంగా ఆడారు” అని కొనియాడారు. హ్యారీ బ్రూక్ డబుల్ సెంచరీని కూడా అభినందించిన అజరుద్దీన్, ఇలాంటి హోరాహోరీ మ్యాచ్‌లు వన్డే ఫార్మాట్‌కు మేలు చేస్తాయని అభిప్రాయపడ్డారు. అయితే, ఆటగాళ్ల నైపుణ్యాలను సంపూర్ణంగా పరీక్షించే టెస్ట్ క్రికెట్టే అసలైన క్రికెట్ అని తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు. ఇది గొప్ప మ్యాచ్, అభిమానులను బాగా అలరించిందని అన్నారు. ఇది క్రికెట్‌కు మంచిదే అన్నారు. వన్డే క్రికెట్‌లో ఓ అద్భుతం ఆవిష్కృతమైన విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టు 430 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి సంచలన విజయం సాధించింది. పాకిస్థాన్‌లోని రావల్పిండి వేదికగా జరిగిన - మిగతా 3లో




రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి

- **ప్రభుత్వ విప్ బొండా ఉమ**
- **స్థానిక ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపణ**
- **2021లో దౌర్జన్యాలతో 24% ఏకగ్రీవాలు చేసుకున్నారని వ్యాఖ్య**
- **కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని స్పష్టీకరణ**
- **2024లోనే వైసీపీ పతనం మొదలైందని, స్థానిక ఎన్నికలతో భూస్థాపితం ఖాయమని జోస్యం**

మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

- **అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**
- **తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని ఆదేశం**
- **బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన**
- **అక్టోబర్ 23 తర్వాత మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపనున్నట్టు వెల్లడి**
- **దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు**



హైదరాబాద్

రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు - మిగతా 3లో

మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలని ఆదేశం

ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన

లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం



శుక్రవారం 23 అక్టోబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

ఎలక్షన్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు

.....ఈనెల 27న సత్యసాయి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలలో ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ల పంపిణీ.

....గతంలో తెలిపిన విధంగా 24వ తేదీ కాకుండా 27వ తేదీ నాడు పోస్టల్ బ్యాలెట్లు అందుబాటులో ఉంటాయని గమనించగలరు.

..... స్పష్టం చేసిన.....జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



పుట్టపర్తి, అక్టోబర్ 23: సీమ వార్త సాయంత్రం.

ఈనెల 27వ తేదీన సత్యసాయి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలలో ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగస్తులు అందరికీ పోస్టల్ బ్యాలెట్ లు అందుబాటులో ఉంటాయని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తెలిపిన విధంగా 24వ తేదీ కాకుండా ఈనెల 27వ తేదీ నాడు సంబంధిత మునిసిపాలిటీలలో పోస్టల్ బ్యాలెట్లు అందుబాటులో ఉంటాయని గమనించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విధులలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోస్టల్ బ్యాలెట్ ను సంబంధిత మునిసిపాలిటీల ద్వారా పొంది తమ ఓటు హక్కును వినియోగించుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు.



ప్రజాధరణే మా అభ్యర్థుల గెలుపు రహస్యం..!!

అట్టహాసంగా ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తాం

పెనుగొండలోని క్యాంప్ కార్యాలయంలో... మంత్రి సవిత

పెనుకొండ అక్టోబర్ 23 సీమ వార్త సాయంత్రం.

కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ విజయానికి బాటలు వేస్తాయని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు. పెనుకొండ మున్సిపల్ చైర్మన్, 23 వార్డులతో పాటు 5 మండలాల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆమె పేర్కొన్నారు. పెనుకొండ లోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీటీసీ అభ్యర్థులు మంత్రి సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో అభ్యర్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. ప్రజల ఆదరణతో నియోజకవర్గంలోని అన్ని స్థానిక సంస్థల స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే విశ్వాసాన్ని - మిగతా3లో









ఎలక్షన్ ఆఫీసర్‌కు ర్యాండమైజేషన్..!!

.....పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ పూర్తి.. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, అక్టోబర్ 23 సీమ వార్త సాయంత్రం.

జిల్లాలో జరిగే 2026 మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ వెల్లడించారు.శుక్రవారం కలెక్టరేట్లోని ఎన్ఐసి హాలులో పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్,జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు ల సమక్షంలో పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మాట్లాడుతూ.... జిల్లాలోని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు గుత్తి, గుంతకల్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 689 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇందుకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధిత హెచ్ఓ లు ఎంట్రీ చేసిన డేటా ప్రకారం అధికారుల హోదా, ఆధారంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయక ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలు మొత్తం 4960 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. కేటాయించిన సిబ్బందికి ఈ నెల 24 వ తేదీన నీలం రాజశేఖర్ రెడ్డి కన్వెన్షన్ హాల్ నందు క్లాస్ రూమ్ తరహాలో శిక్షణ నిచ్చి పకడ్బందీ పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 20 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, డి ఐ ఓ భారతి, ఎన్ఐసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ పిల్లోడి ట్యాలెంట్ అదుర్స్.....

స్వయంకృషితో సాఫ్ట్ వేర్..!!

సీఐఐ సదస్సులో యువ ఆవిష్కర్త గంధం ధీరజ్ సంస్థ వెబ్‌సైట్ ఆవిష్కరణ


క్రాఫ్టురా ఇన్నోవేషన్స్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన ప్రభుత్వ కార్యదర్శి చిరంజీవ్ చౌదరి.

గోరంట్ల (అనంతపురం) అక్టోబర్ 23 సీమ వార్త సాయంత్రం.

గోరంట్లకు చెందిన 15 ఏళ్ల యువ ఆవిష్కర్త గంధం ధీరజ్ స్థాపించిన క్రాఫ్టురా ఇన్నోవేషన్స్ (ఓపీసీ) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధికారిక వెబ్‌సైట్‌ను అనంతపురం జేఎన్‌టీయూలో నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సు -- 2026లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీ చిరంజీవ్ చౌదరి, ఐఎఫ్ఎస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీ విశ్వ మనోహరన్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థికాభివృద్ధి మండలి ఆహ్వానం మేరకు ఈ సదస్సులో పాల్గొన్న ధీరజ్, తాను అభివృద్ధి చేసిన క్విజ్‌క్వెస్ట్ విద్యా సాంకేతిక వేదికను ప్రదర్శించారు. ఈ వేదికలో ప్రత్యక్ష ప్రశ్నోత్తర పోటీలు, ఆన్‌లైన్ పరీక్షలు, ఓఎంఆర్ జవాబు పత్రాల స్కానింగ్, తక్షణ మూల్యాంకనం, తల్లిదండ్రులకు ఫలితాల సమాచారం, విద్యార్థుల ప్రతిభా విశ్లేషణ వంటి సదుపాయాలు ఉన్నాయి. స్వయంకృషితో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి నేర్చుకున్న ధీరజ్, చిన్న వయసులోనే కేంద్ర ప్రభుత్వ డీపీఐఐటీ గుర్తింపు పొందిన అంకుర సంస్థను స్థాపించి, వివిధ రంగాలకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు.ఈ సందర్భంగా ధీరజ్ మాట్లాడుతూ, తన సంస్థ వెబ్‌సైట్‌ను ప్రభుత్వ ఉన్నతాధికారి చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, సమాజానికి ఉపయోగపడే మరిన్ని సాంకేతిక ఆవిష్కరణలు రూపొందించడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ఏపీఈడీబీ, జిల్లా ఎంఎస్ఎంఈ అధికారులకు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గంధం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలపై నిరంతరం నిఘా..!!



....ఈవీఎం గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలి

.....ధర్మవరం మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదామును త్రైమాసిక తనిఖీ చేసిన

....జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

సీమ వార్త సాయంకాలం

శుక్రవారం 23
అక్టోబర్ 2026

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ

విజయం కోసం సమష్టిగా కృషి చేయాలి

హైదరాబాద్ : హైదరాబాద్– రంగారెడ్డి– మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. నాంపల్లిలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. హైదరాబాద్ పరిధిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి ఎంతో రాజకీయ ప్రాధాన్యత కలిగినవని తెలిపారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో హైదరాబాద్ పరిధిలో జరిగే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుల సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలిపారు.అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు.నవంబర్ 6వ లోపు అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పండుగలు ముగిసిన నేపథ్యంలో మరుసటి రోజు నుంచే పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి కార్యాచరణ చేపట్టాలని సూచించారు.హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల్లో బూత్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,



ఉపాధ్యాయులు, న్యాయవాదులు తదితర అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించి, పీసీసీ నాయకులతో కలిసి రోజువారీగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తాను, మంత్రి అజారుద్దీన్ తదితర నాయకులు క్షేత్రస్థాయి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని తెలిపారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వివిధ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాలను పట్టభద్రులకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని పార్టీకి మద్దతు కూడగట్టాలని నాయకులకు సూచించారు.

నాలుగు రోజుల్లోనే రూ.755 కోట్ల 14 లక్షల విలువైన మద్యం


హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో దసరా పండుగ సందర్భంగా మద్యం అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. పండుగకు ముందు నాలుగు రోజుల్లోనే మొత్తం రూ.755 కోట్ల 14 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ లెక్కలు రాష్ట్రంలో మద్యం వినియోగం పెరుగుదలను, తద్వారా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని సూచిస్తున్నాయి. ముఖ్యంగా దసరా పండుగకు ముందురోజు, అక్టోబర్ 19న, మద్యం అమ్మకాలు అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. ఆ ఒక్క రోజులోనే ఏకంగా రూ.303 కోట్ల 40 లక్షల విలువైన మద్యం అమ్ముడుపోయింది. పండుగకు ముందు ఈ అమ్మకాలు పెరగడం సాధారణంగా జరిగే పరిణామమే అయినప్పటికీ, ఈసారి నమోదైన సంఖ్యలు గత రికార్డులను అధిగమించాయి. అమ్మకాల వివరాలను పరిశీలిస్తే, అక్టోబర్ 14న రూ.102 కోట్ల 17 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అక్టోబర్ 15న మద్యం డిపోలకు సెలవు కావడంతో అమ్మకాలు నమోదు కాలేదు. తిరిగి అక్టోబర్ 16న రూ.126 కోట్ల 32 లక్షలు, అక్టోబర్ 17న రూ.223 కోట్ల 25 లక్షల విలువైన మద్యం అమ్ముడైంది. అక్టోబర్ 18న ఆదివారం సెలవు కావడంతో అమ్మకాలు తగ్గగా, అక్టోబర్ 19న అత్యధికంగా రూ.303 కోట్ల 40 లక్షల విక్రయాలు జరిగాయి. ఈ నాలుగు పనిదినాల్లో మొత్తం రూ.755 కోట్ల 14 లక్షల అమ్మకాలు నమోదయ్యాయి.విక్రయించిన మద్యం రకాలలో, ఈ నాలుగు రోజుల్లో 6,83,000 కేసుల హార్డ్ లిక్కర్ అమ్ముడైంది. బీరు విక్రయాలు మరింత ఎక్కువగా, 10,44,000 కేసులకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో సాధారణంగానే బీరు వినియోగం అధికంగా ఉంటుందని ఈ గణాంకాలు మరోసారి ధృవీకరించాయి. అక్టోబర్ 19 వరకు మొత్తం అక్టోబర్ నెలలో రూ.2,055 కోట్ల విలువైన మద్యం



అమ్ముడైంది. గత నెలలతో పోలిస్తే, సెప్టెంబర్ నెలలో రూ.3,209 కోట్లు, ఆగస్టు నెలలో రూ.3,482 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. దసరా పండుగ కారణంగా అక్టోబర్ నెలలో కూడా అమ్మకాలు భారీగానే నమోదయ్యే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత దసరా పండుగతో పోలిస్తే ఈసారి అమ్మకాలు పెరిగాయి. గత దసరా సమయంలో నాలుగు రోజుల్లో రూ.698 కోట్ల విలువైన మద్యం అమ్ముడవగా, ఈసారి రూ.755 కోట్ల 14 లక్షలకు చేరుకోవడం గణనీయమైన వృద్ధిని సూచిస్తుంది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,620 వైన్ షాపులు, సుమారు 1,200 బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్బులు, క్లబ్బుల ద్వారా ఈ మద్యం విక్రయాలు జరుగుతాయి. ఈ మద్యం మొత్తం తెలంగాణలో ఉన్న 17 మద్యం డిపోల నుంచి సరఫరా అవుతుంది. ఎక్సైజ్ శాఖ ద్వారా లభించే ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన వనరులలో ఒకటి. సంక్షేమ కార్యక్రమాలకు, ఇతర ప్రభుత్వ ప్రయోజిత పథకాలకు నిధులు సమకూర్చడంలో మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం కీలక పాత్ర పోషిస్తుంది. రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ తర్వాత అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే శాఖగా ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నిలుస్తుంది. ఈ కారణంగానే ప్రభుత్వాలు మద్యం అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటాయి. ఈ పండుగ సీజన్ అమ్మకాలు ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చినట్లు తెలుస్తోంది.

నకిలీ నంబర్ ప్లేట్.. లైసెన్స్ లేని డ్రైవర్

హైదరాబాద్ : మేడ్చల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరింగింది. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వరంగల్ హైవే పిల్లర్ నంబర్ 57 వద్ద ఉదయం సుమారు 6:30 గంటలకు ఓ ఫార్చ్యూనర్ కారు ముందు వెళ్తున్న ఓ వాహనాన్ని వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న భార్యభర్తలకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు వెంటనే వారిని హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన యువకుడిని అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సాయిశివ (30), తన భార్య మేఘన (28)తో కలిసి టీ08 ఇఖీ 7435 నంబరు గల ఐ10 కారులో ఎల్‌బీ నగర్ నుంచి వరంగల్ జిల్లా నర్సంపేట వైపు బయలుదేరారు. వీరి కారు పీర్జాదీగూడ హైవే పిల్లర్ నంబర్ 57 సమీపానికి చేరుకోగానే, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టయోటా ఫార్చ్యూనర్ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి ముందున్న ఐ10 కారు పల్టీ కొట్టింది. అనంతరం ఫార్చ్యూనర్ కారు ముందుకు వెళ్లి విద్యుత్ స్తంభాన్ని సైతం ఢీకొట్టి ఆగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయిశివ, మేఘన దంపతులను చికిత్స నిమిత్తం చైతన్యపురిలోని ఓజోన్ ఆసుపత్రికి తరలించారు.ఫార్చ్యూనర్ కారు నడిపిన వ్యక్తిని నారపల్లికి చెందిన మంగీలాల్ కుమారుడైన 19 ఏళ్ల అకున్ సబర్వాల్‌గా గుర్తించారు. సదరు వ్యక్తి మద్యం సేవించి ఉన్నట్లు అనుమానం వ్యక్తమైంది. అంతేకాకుండా, డ్రైవింగ్ లైసెన్స్ గురించి ఆరా తీయగా తన వద్ద లైసెన్స్ లేదని తెలిపినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన ఫార్చ్యూనర్ కారుకు అమర్చిన నంబర్ ప్లేట్ కూడా నకిలీదిగా పోలీసులు గుర్తించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ



న్యాయ సంహిత (ఃఔౌ) సెక్షన్లు 281, 125(జీ) తో పాటు మోటారు వాహనాల చట్టం (ఓఎ ంఇబి) లోని సెక్షన్లు 181, 185(జీ), 183, 184, 185, 179(1), 179(2), 80(ం), 50, 51 కింద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు పోలీసులు. డ్రైవింగ్ లైసెన్స్ లేదని తెలిసి కూడా వాహనం నడపడానికి అనుమతించినందుకు వాహన యజమాని మంగీలాల్‌పై కూడా ఓఎ ంఇబి సెక్షన్ 180 కింద కేసు నమోదు చేశారు.మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, నకిలీ నంబర్ ప్లేట్లు వాడటం చట్టరీత్యా తీవ్రమైన నేరాలని పోలీసులు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇచ్చే యజమానులపై కూడా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలను ఎల్లప్పుడూ కలిగి ఉండాలని సూచించారు

కొడంగల్ ఆలయ నిర్మాణ పనులు పరిశీలించిన సీఎం రేవంత్

వికారాబాద్ వికారాబాద్ జిల్లా కొడంగల్లోని ప్రసిద్ధి చెందిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి బాలాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న

కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ : నిజాం కాలంలో పెత్తందార్ల అన్యాయాలకు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది పేదలకు అండగా నిలిచిన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడీఓసీ లో పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్వో స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ. సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకొని దోపిడీ చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

దేవనకొండ వైసిపి ఎంపీపీ అభ్యర్థిగా కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు నామినేషన్..

ఘనంగా సత్కరించిన పార్టీ శ్రేణులు

దేవనకొండ: దేవనకొండ మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు.?నామినేషన్ కార్యక్రమం విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు దివాకర్ నాయుడికి అభినందనలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.?ఈ సందర్భంగా దివాకర్ నాయుడు మాట్లాడుతూ.. దేవనకొండ మండలంలో వైఎస్సార్‌సీపీకి, తమ కుటుంబానికి ప్రజల్లో మంచి గుర్తింపు ఉందని, ప్రజల ఆదరణతో ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ నాయకుల సహకారంతో మండల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కిట్టు వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనరిక్ మందులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

-కట్టమూరి సుబ్బారావు

అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే పేషెంట్ జబ్బు వల్ల కాకుండా మందుల బిల్లుకు భయపడే పరిస్థితి పోవాలంటే జనరిక్ మందులపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని వారధి ట్రస్ట్ చైర్మన్ కట్టమూరి సుబ్బారావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్టీ రవీంద్ర విక్రమ్ తో కలిసి ఆయన మాట్లాడుతూ డాక్టర్లు రాసే మందుల చీటీలోని కార్పొరేట్ మందుల కంటే అత్యంత తక్కువ ధరలో అవే రకమైన మందులను అందించే జనరిక్ ఔషధాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్లు తమ ప్రిస్క్రిప్షన్ లో కార్పొరేట్ మందుల పేర్లు రాయవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నా కూడా అలా జరగక పోవడం వల్ల పేషెంట్లు మందుల కోసం అత్యధిక డబ్బులను వెచ్చించాల్సి వస్తుందని, కార్పొరేట్ మందులతో పోలిస్తే అత్యంత తక్కువ ధరలో అదే మందును అందిస్తున్న జనరిక్ మందుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఇకముందు వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బ్రాండెడ్, కార్పొరేట్ మందులకు, జనరిక్ మందుల మధ్య ధరల వ్యత్యాసాలను ఆయన వివరించారు.

మెడికవర్ ఆసుపత్రిలో రోగి మృతి ఘటన

సోషల్ మీడియాలో అవాస్తవాల ప్రచారం.. స్పందించిన యాజమాన్యం

సికింద్రాబాద్. సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో రోగి మృతి ఘటనపై స్పందించిన యాజమాన్యం, తప్పుడు ప్రచారంపై సమగ్ర విచారణకు డీజీపీని కోరనున్నట్లు వెల్లడించింది. హాస్పటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడుతూ యువ రోగి మృతి పట్ల విషాదం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోగి వచ్చినప్పటి పరిస్థితితో పాటు చికిత్స విధానం గురించి చెబుతూ వైద్యులు అవసరమైన చికిత్సలు మాత్రమే అందచేయడం జరిగిందని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని వేదికల్లో వాస్తవాలకు విరుద్ధమైన సమాచారం ప్రచారం అవుతున్న నేపథ్యంలో ప్రజలకు సరైన వివరాలు తెలియాల్సిన అవసరం ఉందని ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రోగి బయటి డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేయించుకున్న సీటీ స్కాన్‌తో ఆసుపత్రికి వచ్చారని, ఆ నివేదికలో సుమారు 16ఖ 17ఖ 20 మిల్లీమీటర్ల పరిమాణంలో కిడ్నీ రాయి ఉన్నట్లు, అది మూత్ర ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో మూత్రపిండంలో వాపు ఏర్పడినట్లు వెల్లడైందని ఆ పరిమాణంలో ఉన్న రాయిని తొలగించడానికి శస్త్ర చికిత్స తప్పనిసరి అని అందుకే శస్త్ర చికిత్స చేసి తొలగించడం జరిగిందని చెప్పారు. కానీ 1ఎంఎం, 2ఎంఎం అని రాయి అని సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేసారని అన్నారు. కొంతమంది వ్యక్తులు మెడికవర్ హాస్పిటల్ కు ఒక రాజకీయ పార్టీ నేతకు సంబంధం అంతకడుతూ తమ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నం చేసారని వారిపైన చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు పరువు నష్టం దావా కూడా వేయనున్నట్లు వెల్లడించారు.

అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి: తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్ : త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా బీఆర్ఎస్ పార్టీ నాయకులు విస్తృత అవగాహన కల్పించాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ వరకు గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కాలనీలు, బస్తీలతో సంబంధం లేకుండా అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదుకు ప్రోత్సహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ బాధ్యతగా వ్యవహరించి నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించిన పార్టీ నాయకులను తలసాని అభినందించారు.

హోసూర్ గ్రామం లో కూటమి తరఫున బిజెపి బ్రహ్మయ్య నామినేషన్ దాఖలు

పత్తికొండ : పత్తికొండ మండల పరిధిలోని హోసూర్ గ్రామంలో ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా, హోసూర్ గ్రామం నుండి కూటమి ప్రభుత్వం తరఫున ఎంపీటీసీ-1 అభ్యర్థిగా బిజెపి బ్రహ్మయ్య అధికారికంగా తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.ఈ నామినేషన్ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

సీమ వార్త సాయంకాలం

శుక్రవారం 23
అక్టోబర్ 2026

గోరంట్ల మండల కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి నామినేషన్.



గోరంట్ల అక్టోబర్ 23 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండల కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థిగా పెనుగొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, మాజీ సర్పంచ్ పాలసముద్రం నరసింహులు భార్య సునీత శుక్రవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో రిటర్నింగ్ అధికారికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి నరసింహులు తో పాటు ఆమె తన నామినేషన్ పాత్రలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు

14 మంది తెదేపా ఎంపీటీసీ అభ్యర్థులు

-- ఎన్టీఆర్ సర్కిల్ నుండి ఎంపీడీఓ కార్యాలయం ర్యాలీ



సోమందేపల్లి అక్టోబర్ 23 సీమ వార్త సాయంకాలం కూటమికి చెందిన14 ఎంపీటీసీ గ్రామాల టీడీపీ శ్రేణులు శుక్రవారం హాజరై నామినేషన్లు దాఖలు వేశారు. ఎంపీడీవో కార్యాలయంలో 14 మంది ఎంపీటీసీలు నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర బోయవాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు,కన్వీనర్ వెంకటేశులు, చల్లాపల్లి రామకృష్ణ, సంజీవరెడ్డి, శరత్ చంద్ర, ఎంపీపీ అభ్యర్థి నీరుగంటి చంద్రశేఖర్, సీసీ హరి, బీజేపీ యువ నాయకులు ఎస్ ఆర్ పార్థసారథిరెడ్డి, జనసేన కన్వీనర్ జబీవుల్లా, కూటమి నాయకులు, మహిళా నాయకురాళ్లు, అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గోరంట్ల మండల...
జనసేన జడ్పీటీసి అభ్యర్థి నామినేషన్.



గోరంట్ల అక్టోబర్ 23 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన నాయకుడు అనిల్ యాదవ్ భార్య సునేత్ర జిల్లా కేంద్రంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాకా చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా, జిల్లా పరిషత్ కార్యాలయంలో (కొత్తచెరువు) నందు కూటమి అభ్యర్థి గా నామినేషన్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ యాదవ్, పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు పాగు తోట వెంకటేష్, చిలమత్తూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధరణే మా అభ్యర్థుల గెలుపు రహస్యం..!!

-మొదటిపేజీ తరువాయి

మంత్రి వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

ఈవీఎంలపై నిరంతరం నిఘా..!!



ధర్మవరం,అక్టోబర్ ,23 సీమ వార్త సాయంత్రం. జిల్లాకు కేటాయించిన ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24/7 పటిష్టమైన భద్రత, నిరంతర నిఘా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న నెలవారీ తనిఖీల్లో భాగంగా, శుక్రవారం ధర్మవరం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాము వద్ద అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, రక్షణ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గోదాము భద్రత, నిర్వహణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరిన పలు వివరాలపై, వారి అడిగిన సందేహాలకు కలెక్టర్ స్పష్టమైన సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి,ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య,ధర్మవరం తహశీల్దార్ దేవరాజు,రెవెన్యూ సిబ్బంది మరియు వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

430 పరుగుల లక్ష్య ఛేదన..

-మొదటిపేజీ తరువాయి

ఈ మ్యాచ్‌లో చివరి ఓవర్ వరకు పోరాడిన శ్రీలంక, ఒక బంతి మిగిలి ఉండగానే గెలుపును అందుకుంది. వన్డే క్రికెట్ చరిత్రలోనే ఇది రెండో అతిపెద్ద విజయవంతమైన ఛేదనగా రికార్డు సృష్టించింది. 2006లో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా 438 పరుగులు ఛేదించిన తర్వాత ఇదే అత్యధికం. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్, హ్యారీ బ్రూక్ (202) రికార్డు డబుల్ సెంచరీతో విరుచుకుపడటంతో నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 429 పరుగుల భారీ స్కోరు చేసింది. కేవలం 114 బంతుల్లోనే డబుల్ సెంచరీ పూర్తి చేసిన బ్రూక్, వన్డేల్లో ఇంగ్లండ్ తరఫున ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా, అలాగే ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ వీరుడిగా చరిత్రకెక్కాడు. అతనికి జో రూట్ (69), విల్ జాక్స్ (66లి) చక్కటి సహకారం అందించారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక, 24 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో పవన్ రత్నాయకే (130) సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అవిష్క ఫెర్నాండో (97), దసున్ శనక (97) తృటిలో సెంచరీలు చేజార్చుకున్నా, అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో గెలుపు ఆశలు రేపారు. చివర్లో జనిత్ లియనాగే (61 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టుకు చారిత్రక విజయాన్ని అందించాడు.

రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి



రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే జగన్ 'క్రిమినల్ లిటిగెంట్'గా మారి, న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం నుంచి అందాల్సిన సుమారు రూ. 12,500 కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర అని బొండా ఉమ మండిపడ్డారు. "నేడు ఎన్నికలు జరిగితే వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. అందుకే నామినేషన్ల ప్రక్రియ మొదలైన నాటి నుంచే దౌర్జన్యాలకు తెరలేపారు. పుంగనూరు, తిరుపతి, నగరి, రాయచోటి వంటి ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టడం, రాళ్లు, కర్రలతో దాడులు చేయడం వంటి అరాచకాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు కూడా స్పష్టంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, కిడ్నాపులు, హత్యాయత్నాలతో 24 శాతం స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుందని బొండా ఉమ గుర్తుచేశారు. "పుంగనూరులో 85 స్థానాలకు గానూ 84, మాచర్లలో 77 స్థానాలకు గానూ 74 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న నీచ చరిత్ర జగన్‌ది. 2014లో చంద్రబాబు హయాంలో కేవలం 1 శాతం మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. దొంగే దొంగ అన్నట్లుగా, తను చేసిన అరాచకాలను ఇతరులపై నెట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నారు" అని విమర్శించారు. సొంత బాబాయిని హత్య చేయించి, 'నారాసుర రక్తచరిత్ర' పేరిట దుష్ప్రచారం చేసిన వ్యక్తి జగన్ అని, గతంలో ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 27 నెలల్లో రూ. 1,60,000 కోట్లను సంక్షేమానికి ఖర్చు చేస్తూ, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పరాజయం తప్పదనే భయంతోనే జగన్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, 2024లోనే వైసీపీ పతనం ప్రారంభమైందని, స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగితే ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని బొండా ఉమ జోస్యం చెప్పారు.

మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తాడిపత్రి ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియలో చక్రం తిప్పిన పోలీస్ అధికారి

మొదటి రోజు శాంతం, రెండవ రోజు ప్రశాంతం, మూడవ రోజు సుఖాంతం దిశగా..





తాడిపత్రి, అక్టోబర్ 23 సాయంకాలం(సీమ వార్త): రాష్ట్ర రాజకీయ చరిత్రలో తాడిపత్రి నియోజకవర్గానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. తాడిపత్రి పట్టణం మరియు నియోజకవర్గంలో నిత్యం ఏదో ఒక విషయంలో ఘర్షణ వాతావరణం, ఇరు పార్టీల నాయకుల సవాళ్లు, ప్రతి సవాళ్లతో అట్టుడికి పోయేది. మరి ఎలక్షన్ల సమయంలో చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఓ పోలీసు ఉన్నతాధికారి చొరవతో పరిస్థితి మొత్తం భిన్నంగా తయారైంది. ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడంలో ఆ అధికారి కీలక పాత్ర పోషించారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు పోలీసులు టీడీపీ, వైసీపీ నేతల మధ్య చర్చలు జరిపి ఒక ఒప్పందాన్ని కుదిర్చారు. నామినేషన్ల చివరి రోజైన నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైసీపీ అభ్యర్థులకు, మధ్యాహ్నం 2 గంటల తర్వాత టీడీపీ అభ్యర్థులకు నామినేషన్లు వేసుకునేందుకు సమయాన్ని కేటాయించారు. దీంతో ఉదయం నుంచే వైసీపీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ నామినేషన్లను అందజేస్తున్నారు. ఇరు పార్టీల నాయకులను సమన్వయం చేసుకొని ఘర్షణలకు తావివ్వకుండా నామినేషన్ల ప్రక్రియను సజావుగా జరిపించడంలో ఆ పోలీస్ అధికారి చూపిన చొరవ అభినందనీయమే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

నామినేషన్ల వివరాలు:

- మొదటి రోజు: 12 (టీడీపీ 11, ఇండిపెండెంట్ 1)
- రెండవ రోజు: 17 (టీడీపీ 17)
- మూడవ రోజు: ప్రక్రియ కొనసాగుతోంది.

ఈ ప్రశాంత వాతావరణాన్ని గమనించే రాష్ట్ర ఎన్నికల సంఘం తాడిపత్రిని రీ-నామినేషన్ జాబితా నుంచి తొలగించిందని టీడీపీ వర్గాలు హర్షం వేక్తం చేశాయి.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై కేసు నమోదు



సోమందేపల్లి అక్టోబర్ 23 సీమ వార్త సాయంకాలం మండల కేంద్రంలోని చల్లాపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ అభ్యర్థి నాగరత్నమ్మ భర్త గంగాధర్‌తో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తులు 22.10.2026న ఉదయం సుమారు 11:30 గంటలకు సోమందేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల సమీపంలో అనుమతులు లేకుండా మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించి, ఎన్నికల ప్రవర్తనానియమావళిని ఉల్లంఘించినట్లు ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ బృందం సమర్పించిన నివేదిక ఆధారంగా సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 87/2026గా కేసు నమోదు చేసి, సంబంధిత క్రిమినల్ చట్టాల కింద దర్యాప్తు చేపట్టారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించడం, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడవద్దని ప్రజలకు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు హెచ్చరించడమైనది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెనుకొండ డిఎస్పీ శివప్రసాద్ హెచ్చరించారు.

తిప్పేపల్లి తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా జిలా జిర్ల శ్రీనివాసరెడ్డి



ఓబులదేవరచెరువు (అక్టోబర్23)సీమవార్త సాయంకాలం: ఓడి చెరువు మండలం తిప్పేపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున జిలా జిర్ల శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఆయన నామినేషన్ పత్రాలను ఆర్వో రాజేంద్రనాథ్ రెడ్డికి సమర్పించారు. తెలుగుదేశం పార్టీలో గతం నుంచి ఉంటూ పార్టీ అభివృద్ధికి వాటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సేవ చేశారు. అంతేగాక ఓడి చెరువు ప్రాంతంలో తనదైన శైలిలో టిడిపి నాయకులు, కార్యకర్తలకు దగ్గరగా ఉంటూ మంచి పేరు సాధించారు.అలాగే పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లారు.పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అభిమానం పొందారు. పార్టీకి శ్రీనివాసరెడ్డి చేసిన సేవలు గుర్తించి అధిష్టానం ఎంపిటిసి గా పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. తిప్పేపల్లి ఎంపీటీసీ స్థానాన్ని ప్రజలు గెలిపించి ఆశీర్వదిస్తారనే ధీమాను వ్యక్తం చేశారు. ఉంట్ల మహేశ్వరా రెడ్డి, డీలర్ సతీష్ రెడ్డి,గంటా శ్రీనివాసులు,కంచి సురేష్,కొత్త సుధాకర్ రెడ్డి,డాబా రామ్ శెట్టి, మిరియాల చంద్ర,పట్టా భాస్కర్,చంద్రశేఖర్ రెడ్డి తదితరులు అభ్యర్థి వెంట ఉన్నారు.

వైసీపీ జడ్పిటిసి అభ్యర్థిగా ఆరిఫా నామినేషన్ దాఖలు.



గోరంట్ల అక్టోబర్ 23 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థిగా పులేరు కు చెందిన మాజీ మంత్రి అధికారి పులేరు భాష భార్య అరిఫా జిల్లా కేంద్రంలో రిటర్నింగ్ అధికారి వద్ద తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సురేష్ రెడ్డి...సురేష్ రెడ్డి. ప్రసాద్,లక్ష్మీనారాయణ రెడ్డి రామచంద్రారెడ్డి,మిలటరీ బాష , కాలందర్ సబ్, రఫీ,సురేంద్ర రెడ్డి,రాజేష్, శివప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881